ప్రజాశక్తి

మంగళవారం 22 అక్టోబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అభ్యంతరాలున్నా ససేమిరా!



- 'మా యాత్రలు మేం చేసేస్తాం'... అంటోన్న ప్రధాన పార్టీల కార్పొరేటర్లు
- రూ.కోట్ల ప్రజాధనంతో 8 రోజుల యాత్రకు బయల్దేరిన వైనం...
- నగరంలో సమస్యల సవాళ్లు పట్టవా? అంటూ విశాఖ వాసుల ఆవేదన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నగరంలోనే అనేక సమస్యలు సవాళ్లను విసురుతున్న సమయంలో ఇక్కడ కాకుండా అధ్యయనం పేరుతో దేశ యాత్రలను చేయడం వల్ల ఎవరికి లాభం అంటూ విశాఖ ప్రజలు, కొద్దిమంది కార్పొరేటర్లు యాత్రకు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా 'కూటమి' పార్టీలకు చెందిన మెజారిటీ కార్పొరేటర్లు, వైసిపి కార్పొరేటర్లు తమను 'ఆపేదెవరు'? అన్న వైఖరిని మాత్రం వదల్లేదు. ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకూ దేశంలోని ప్రధాన నగరాల్లో అధ్యయన యాత్ర పేరుతో సుమారు 71 మంది సోమవారం సాయంత్రం బయల్దేరారు. విశాఖ ఎయిర్‌పోర్టులో మహిళా కార్పొరేటర్లంతా కలిసి దిగిన ఫొటో మీడియాకు వచ్చింది. స్థానికంగా వార్డుల్లో ప్రాథమిక సమస్యలైన వీధి లైట్లు, రోడ్లు రిపేర్లు, డ్రెయినేజీలు, కరెంట్ సమస్యలు పెద్ద ఎత్తున ఇబ్బంది పెడుతున్నా ఇక్కడ కనీసంగా పర్యటించకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లడం దేనికంటూ ప్రజానీకం గగ్గోలు పెడుతోంది. ఈ పేరుతో షికార్ల కోసం సుమారు రూ.కోటికి పైగా ప్రజా ధనం వృథా చేయడం క్షమించరాని నేరం అంటూ పలువురు ఎద్దేవా చేస్తున్నారు. అంతేగాక మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి)లోని ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ విభాగాల నుంచి వసూళ్లు చేపట్టారన్న ఆరోపణలను ఈ యాత్రలో పాల్గొన్న కార్పొరేటర్లు ఎదుర్కొంటున్నారు.

పరిష్కారానికి నోచని పలు సమస్యలు...

జివిఎంసిలోని 98 వార్డుల్లోనూ పలు సమస్యలు తాండవిస్తున్నాయి. ప్రభుత్వాలు వేసే ఆర్థిక భారాలు, పారిశుధ్య కార్మికులకు జీతాల చెల్లింపుల్లో తాత్సారం, అవకతవకలు నిత్యకృత్యంగా ఉంటున్నాయి. నగరంలోని పలుచోట్ల పూర్తిస్థాయిలో మంచినీటిని సైతం ప్రజానీకానికి వార్డుల్లో సరఫరా చేయలేని పరిస్థితి ఎక్కడ చూసినా కనిపిస్తోంది. పైపుల లీకేజీలతో నీటి వృథాను జివిఎంసి అరికట్టలేని స్థితి ఉంది. విశాఖ నగరాన్ని ఎంతో కొంత మోడల్‌గా అభివృద్ధి చేశాక ఇతర చోట్ల నేర్చుకునేందుకు వెళ్లినా ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు. గతంలో ఇలాంటి యాత్రలకు జివిఎంసి ఆధ్వర్యాన కార్పొరేటర్లు వెళ్లారు. 2022-2023లో ఢిల్లీ, సిమ్లా, కాశ్మీర్, కులుమనాలి, చండీఘర్, శ్రీనగర్ వంటి చోట్ల యాత్రలు చేశారు. ఆ తర్వాతైనా విశాఖలో మురుగునీటి సమస్య, పారిశుధ్య సమస్యలు పరిష్కారం అయ్యాయా? అంటే ఎవ్వరూ 'ఎస్' అని చెప్పలేని పరిస్థితి ఉంది. 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ (జనసేన) మాత్రమే ఈ యాత్రతో ప్రజాధనం వృథా అని తాము బహిష్కరిస్తున్నట్లుగా కమిషనర్‌కు

మిగతా 2లో..

నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు గెజిట్ నోటిఫికేషను జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఛాంబరులో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల నోటిఫికేషను వివరాలను జిల్లా కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో ఒక మేజరు, మూడు మీడియం, ఒక మైనరు నీటి ప్రాజెక్టు సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని సాగునీటి వనరుల కింద ఉన్న సాగునీటి సంఘాలకు అక్టోబరు 21 నుంచి నవంబరు 29వ తేదీ వరకు వివిధ దశలలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు. జిల్లాలో పెద్దతరహా నీటిపారుదల వనరులు కింద తాండవ జలాశయం వస్తుందని తెలిపారు. ప్రాజెక్టు కమిటీలు 4, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 3, నీటి వినియోగదారుల సంఘాలు 303 ఉన్నట్లు వివరించారు. ఓటరు లిస్టులను శుద్ధీకరణ చేస్తామని, ఇంతవరకు ఎన్నికలు జరగని పెద్దేరు జలాశయానికి కొత్తగా ఓటరు లిస్టు తయారు చేస్తామని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు ఇతర శాఖల నుండి 668 గెజిటెడ్ అధికారులను పోలింగు అధికారులుగా, 1530 మంది సిబ్బందిని నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎ.త్రినాథన్, డిఇ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

జిల్లా అభివృద్ధిపై 25న ఇన్‌ఛార్జి మంత్రి సమీక్ష

విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లా అభివృద్ధిపై ఈ నెల 25న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి సమీక్ష నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో తొలిసారిగా జిల్లాకు విచ్చేస్తున్న ఆయన కలెక్టరేట్ మీటింగు హాలులో జిల్లా అధికారులతో భేటీ అవుతారని చెప్పారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, పరిపాలనా పరమైన అంశాలపై చర్చిస్తారని తెలిపారు. అన్ని విభాగాల హెచ్ఒడిలు

మిగతా 2లో..

ఇక్కడ నుంచి సీ వ్యూ బాగుంది

రుషికొండ ప్యాలస్‌పై డిప్యూటీ సిఎం

▶ వార్త మెయిన్ 2లో..

ఎంవివి అక్రమాలపై లోతుగా దర్యాప్తు

▶ వార్త మెయిన్ 2లో..

బాల కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్

▶ వార్త 8లో..

తుపాన్‌ను ఎదుర్కొనేందుకు సంసిద్ధం : జివిఎంసి కమిషనర్

▶ వార్త 2లో..



పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న సిపి శంఖబ్రత బాగ్చీ

పోలీసు అమరవీరులకు నివాళి

వార్తలు 8లో..

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు పోటెత్తిన వినతులు

- ఎప్పటిలాగానే భూ వివాదాలపై అత్యధిక అర్జీలు...
- జనావాసాల్లో వైన్‌షాపులు వద్దంటూ ఆందోళనలు
- జీవో అమలు కోసం గళమెత్తిన వికలాంగులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/ కలెక్టరేట్

విశాఖ కలెక్టరేట్‌కు సోమవారం ఉదయం వివిధ సమస్యలపై పలు తరగతులకు చెందిన ప్రజలు విచ్చేసి తమ అర్జీలను జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు విన్నవిస్తూ తమ గోడును వెల్లడిసుకున్నారు. మొత్తం వచ్చిన 230 వినతుల్లో అత్యధికంగా 84కు పైగా రెవెన్యూ భూ సంబంధిత సమస్యలపై బాధితులు ఏకరువు పెట్టారు. వికలాంగులు, జీతాలందక శానిటరీ వర్కర్లు, పోలీసుల వేధింపులు తట్టుకోలేక బాధితులు, వైన్స్ షాపులు జనావాసాల్లో వద్దంటూ ప్రజలు ఇలా అనేక సమస్యలతో సతమతమవుతూ జనం కలెక్టరేట్ గడప తొక్కారు.

రూ.15వేల పింఛన్ కోసం వికలాంగుల పోరాటం...

ప్రధానంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్‌పిఎస్) ఆధ్వర్యాన 90 మంది వికలాంగులు రూ.15వేలు పింఛన్ కోసం పెద్ద సంఖ్యలో కదలి వచ్చారు. 85 శాతం 90శాతం వికలాంగత్వం ఉన్న వారికి సైతం రూ.15 వేలు పెన్షన్ రావడం లేదని, తక్షణమే శిబిరం నిర్వహించి అమలు చేసేలాగ కృషి చేయాలంటూ సంఘం నాయకులు అక్కిరెడ్డి అప్పారావు, ఎస్ మల్లీశ్వరి ఆధ్వర్యాన కలెక్టర్, డిఆర్ఒ మోహన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న శానిటరీ వర్కర్లకు 3 నెలలుగా జీతాలు చెల్లించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, గతంలో అమ్మఒడి నుంచి రూ.1000 మినహాయించి రూ.5వేలు వేసేవారని ఏపి పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ఉపాధ్యక్షులు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పాఠశాలల శానిటరీ వర్కర్లు

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అభ్యంతరాలున్నా ససేమిరా!

లేఖరాశారు.

నగర జీవులపై బాదుడు తప్పేనా?

ఇప్పటికే ఆస్తిపన్ను మోత జనంపై ఉంది. ప్రస్తుతం ఆస్తిపన్ను నగరంపై భారంగా ఉన్నా ప్రభుత్వాలకు పట్టడం లేదు. యూజర్ ఛార్జీల పేరుతో గత వైసిపి ప్రభుత్వం వడ్డించింది. యాత్రల వల్ల, వెళ్లొచ్చాక నీటి మీటర్లను అప్పట్లో విశాఖలో పలుచోట్ల అమర్చడం విమర్శలకు గురైంది. ఇంకా అనేకనేక భారాలు పడవన్న గ్యారెంటీ ఏమీ పాలకులు ఇవ్వడం లేదు. యాత్రకు వెళ్లేందుకు 85 మంది కార్పొరేటర్లకు గానూ సోమవారం 71 మంది బెంగళూరుకు వెళ్లినట్లు జివిఎంసి అధికారులు సోమవారం రాత్రి స్పష్టం చేశారు. వీరితో పాటు 14 మంది జివిఎంసి సిబ్బంది, ఒక వైద్యుడు యాత్రలో పాల్గొంటున్నారు. ఈ అధ్యయన యాత్ర కో-ఆర్డినేటర్‌గా జివిఎంసి సెక్రటరీ బివి.రమణ వ్యవహరిస్తున్నారు. ఈ యాత్ర ఎన్ని రోజుల పాటు ఎక్కడెక్కడికి వెళ్తున్నారన్న వివరాలను ఎప్పటికప్పుడు సెక్రటరీ వెల్లడించనున్నారు.

షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రకారం...

వీరంతా 21వ తేదీన బెంగళూరుకు చేరుకుంటారు. 22న ఉదయం బెంగళూరులోని కార్పొరేషన్‌లో మురుగునీటి నిర్వహణ, మంచినీటి సరఫరాపై పరిశీలన చేస్తారు. భోజనం అనంతరం బెంగళూరు సిటీలో టూర్ చేపడతారు. 23న ఉదయం మైసూరుకు వెళతారు. అక్కడ కార్పొరేషన్ కార్యాలయంలోని అభివృద్ధి పనులను చూస్తారు. స్థానికంగా మైసూరులో ప్రదేశాలను సందర్శిస్తారు. 24న బందీపూర్ వెళ్లి అభయారణ్యంలో పర్యటిస్తారు. తర్వాత రోజూ 25న ఊటీ పర్యటన ఉంటుంది. ఆ తర్వాత బెంగళూరుకు విచ్చేస్తారు. 26న పానాజీ వెళతారు. 27వ తేదీన పానాజీలో చారిత్రక పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారు. పానాజీ మున్సిపల్ కార్పొరేషన్‌లో అమల్లోఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన చేసుకునే కార్యక్రమం. ఆ తర్వాత పానాజీ నుంచి విశాఖపట్నం 28వ తేదీ నాటికి చేరుకుంటారు.

జిల్లా అభివృద్ధిపై 25న ఇన్‌ఛార్జి మంత్రి సమీక్ష

సంబంధిత శాఖల్లో చేపట్టిన పనులు, సాధించిన విజయాలపై పూర్తిస్థాయి నివేదికలతో హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని విభాగాల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారికి సూచించారు.

ఆనందపురం మండల పరిధిలోని సి.కన్వెన్షన్ హాలులో భీమిలి నియోజకవర్గ స్థాయి అభివృద్ధి సమీక్ష కూడా అదే రోజు ఉదయం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. వివిధ విభాగాల ఆధ్వర్యాన నియోజకర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ అంశాలపై సమీక్ష ఉంటుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఆర్‌డిఒ సమక్షంలో సమీక్ష జరుగుతుందని, ఆయా శాఖల అధికారులు పూర్తి వివరాలతో కూడిన నివేదికలతో హాజరు కావాలని ఆదేశించారు.

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు పోటెత్తిన వినతులు

పి మణి, జిల్లా కార్యదర్శి జి.మంగశ్రీ ఆధ్వర్యాన కలెక్టర్‌కు వినతి అందించారు. 300 మంది విద్యార్థులకు ఒక శానిటరీ వర్కర్‌ను నియమించడంతో తమపై పని ఒత్తిడి తీవ్రంగా ఉందని, తమ జీతం కూడా కేవలం రూ.6వేలుతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, ఇవి కూడా నెలనెలా అందడం లేదంటూ ఆవేదన చెందారు.

మల్కాపురం సిఐపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

మల్కాపురం స్టేషన్ ఇన్‌స్పెక్టర్ తనను అకారణంగా స్టేషన్‌కు పిలిచి ఎడమ చేయి విరగొట్టి బెదిరించి పంపించారంటూ మల్కాపురం 63వ వార్డు పరిధిలోగల జై ఆంధ్రా కాలనీ నివాసి శివాల జగ్గారావు జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. అందరూ చూస్తుండగా ఇటీవల తనను లాకప్ రూమ్‌వైపు ఈడ్చుకుంటూ వెళ్లి లాఠీలతో మోదాడని విలపించాడు. ఈ ఘటన జరిగిన తర్వాత తనను కుటుంబ సభ్యులు ఇఎస్ఐ ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించగా వైద్యానికి నిరాకరించడంతో కెజిహెచ్‌లో చేరినట్లు జగ్గారావు ఫిర్యాదులో పేర్కొన్నారు. నగర పోలీస్ కమిషనర్‌కు సిఐపై ఫిర్యాదు చేశానని తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

మద్యం మా మధ్య వద్దంటూ...

వైన్‌షాపులపై ప్రజా నిరసనలు కొనసాగుతున్నాయి. సోమవారం గ్రీవెన్స్‌లోనూ ఇవి దర్శనమిచ్చాయి. నగరంలోని 34వ వార్డు పరిధిలోగల భూపేష్‌నగర్ (చావుల మదుము) వద్ద బందరు మిఠాయి షాపు పక్కన ఏర్పాటు చేసిన వైన్స్ షాపును తొలగించాలంటూ సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు ఆధ్వర్యాన మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో హాజరై నిరసన తెలిపారు. గతంలో ఇక్కడ మెడికల్ షాపు ఉండేదని, అది తొలగించి మందు షాపు ఏమిటి? అంటూ జనం ప్రశ్నించారు. మద్యం షాపులపై జనం ఆందోళనలు ఎక్కడికక్కడ సాగుతున్నాయి. ఇప్పటికే సాగర్‌నగర్ సుభాష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వైన్‌షాపుపైనా, మధురవాడ పరదేశిపాలెంలో ప్రభుత్వ భూమి 300 గజాలు కబ్జా చేసి ఏర్పాటు చేసిన 'హర్ష వైన్స్' షాపును మూసెయ్యాలంటూ ఆందోళనలు కొనసాగుతున్నాయి.

పరిష్కార వేదికకు ఫిర్యాదులిలా....

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 230 వినతులు కలెక్టర్, డిఆర్‌ఒకు అందాయి. వీటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి 84, జివిఎంసికి 65, పోలీస్ శాఖకు సంబంధించినవి 12, ఇతర శాఖలకు సంబంధించి 69 ఉన్నాయి. ఫిర్యాదుల స్వీకరణలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌సహా డిఆర్‌ఒ మోహన్‌కుమార్, ఆర్‌డిఒ పి.శ్రీలేఖ, జివిఎంసి ఎడిసి వర్మ, వివిధ జిల్లా శాఖల అధికారులు ఉన్నారు.

తుపాన్‌ను ఎదుర్కొనేందుకు సంసిద్ధం : జివిఎంసి కమిషనర్



ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బుధవారం నాటికి తుపానుగా మారే అవకాశం ఉన్నందున ఎదుర్కొనేందుకు జివిఎంసి యంత్రాంగం సిద్ధంగా ఉందని కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ సోమవారం తెలిపారు. నగరంలో ఉన్న కొండవాలు, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ విషయమై విశాఖ జిల్లా కలెక్టరు ఎమ్ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు తుపాన్ ప్రభావం వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జివిఎంసి పునరావాస కేంద్రాలను సిద్ధం చేసిందని కమిషనర్ తెలిపారు. 600 మందితో రాపిడ్ రెస్క్యూ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. తుపాను సంభవించినప్పుడు ఇబ్బందులను తెలియజేయడానికి జివిఎంసి టోల్ ఫ్రీ 1800 4250 0009 నెంబరుకు ప్రజలు తెలియజేయవచ్చనని పేర్కొన్నారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించండి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రజా ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో వెంటనే పరిష్కరించాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. జివిఎంసికి సంబంధించిన ప్రజా ఫిర్యాదులు, కోర్టు కేసులు, ఆడిట్ అభ్యంతరాలు, ఈ -ఆఫీస్ అమలు తదితర అంశాలపై విభాగాధిపతులు, స్టేట్ ఆడిట్ రీజినల్ డైరెక్టర్ సీతారామారావు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జోనల్ కమిషనర్లతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, జివిఎంసి పరిధిలో ప్రజలకు కల్పించవలసిన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు, తదితర అంశాలపై ప్రజల నుంచి ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంలో వస్తున్న ఫిర్యాదులు, వినతులకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక శ్రద్ధతో నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, వీధి దీపాల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, అన్ని వినతులు, ఫిర్యాదులపై నిర్లక్ష్యం, అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని విభాగాధిపతులను, జోనల్ కమిషనర్లను కమిషనరు ఆదేశించారు.జివిఎంసికి సంబంధించిన కోర్టు కేసులు, రిట్ పిటిషన్లపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, కేసులు తీవ్రతను తగ్గించుటకు కావలసిన విషయంపై దృష్టి సారించి నిర్ణీత సమయంలో సంబంధిత కేసులను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. వివిధ విభాగాలకు సంబంధించి ఆడిటర్ అభ్యంతరాలు, అడ్వాన్సులు తిరిగి చెల్లింపులు తదితర అంశాలపై స్టేట్ ఆడిట్ విభాగం అభ్యంతరాలకు నిర్ణీత సమయంలో సమాచారాన్ని అందించి సమస్యలను పరిష్కరించాలన్నారు.

దేశంలో ఆర్థిక అక్షరాస్యత పెరగాలి

ఎంఎఫ్ఎఐ సిఇఒ చలసాని వెంకట్‌నాగేశ్వర్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : దేశంలో ఆర్థిక అక్షరాస్యత బాగా పెరగాల్సి ఉందని మ్యూచువల్ ఫండ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చలసాని వెంకట నాగేశ్వర్ అన్నారు. సెబీ ఆధ్వర్యాన మ్యూచువల్ ఫండ్స్‌పై ప్రజల్లో అవగాహన కలిగించేలా చేపడుతున్న పలు కార్యక్రమాలలో భాగంగా ఆయన విశాఖ వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం బీచ్ రోడ్ లోని పార్క్ హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అక్టోబర్ 14 నుంచి 20వ తేదీ వరకు ప్రపంచ పెట్టుబడిదారుల మహోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. మ్యూచువల్ ఫండ్స్ దేశంలో ప్రవేశించి 60 సంవత్సరాలు అయినప్పటికీ మిగిలిన దేశాలతో పోలిస్తే ఆశించిన రీతిలో పెట్టుబడులు పెరగలేదన్నారు. గత కొంతకాలంగా మాత్రం ప్రజల్లో అవగాహన పెరిగిందని, మరింత పెరగాల్సి ఉందన్నారు. సెబీ సూచనల దేశంలో ఏపీ సహా మూడు రాష్ట్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

23న ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సుల అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా యూనిట్ ఎన్నికలు ఈ నెల 23న జరుగుతాయని జిల్లా యూనిట్ ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కెజిహెచ్‌లోని యూనియన్ బ్యాంకు పక్కనున్న భవనంలోని నర్సుల క్లాక్ రూమ్‌లో సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరుగుతాయని చెప్పారు.ఉమ్మడి విశాఖపట్టణం జిల్లాలోని ఓటర్లందరూ ఈ ప్రక్రియలో భాగస్వామ్యమై ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఓటరూ తప్పకుండా ఐడెంటిటీ కార్డుతో పాటు, ఒరిజినల్ ఆధార్ కార్డు లేక ఏదైనా ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులు ఎవరూ కూడా పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఏ విధమైన ప్రచార బ్యానర్లు, ఫ్లెక్సీలు, టెంట్లు ఏర్పాటు చేయరాదన్నారు. నిబంధనలు పాటించి ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

108 ఉద్యోగులకు బకాయి జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : 108 ఉద్యోగులకు బకాయి ఉన్న రెండు నెలల జీతాలు తక్షణం చెల్లించాలని 108 యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.బంగార్రాజు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఆవరణలో 108 ఉద్యోగులు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల నెలా జీతాలు అందక తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని చెప్పారు. జీతాలు బకాయి ఉండడమే కాకుండా, వార్షిక ఇంక్రిమెంట్ సమస్యలు ఉన్నాయని తెలిపారు. వాహనాల కండిషన్ వెంటంగా వ ర చా ల ని కోరారు.

మునగ చెట్టు, ఆకుల ఆవశ్యకతపై పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మనుషుల ఆరోగ్యానికి దోహద పడుతూ, ఎన్నో పోషక విలువలు కలిగిన మునగ చెట్టు, ఆకుల ఆవశ్యకతను తెలుపుతూ ఐసిడిఎస్ విభాగం ఆధ్వర్యాన రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్‌డిఒ, డిఇఒ, ఐసిడిఎస్ పీడీ జయదేవిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పీడీ జయదేవి మాట్లాడుతూ, మునగ చెట్టు, ఆకుల ఐరన్, ప్రొటీన్, విటమిన్ -ఎ, సి, ఇ, విటమిన్ - బి1, బి2, బి3, బి6 లభిస్తాయని తెలిపారు. వీటితో పాటు కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్ లభిస్తాయని వివరించారు.

జివిఎంసిలో సీనియర్ సహాయకులకు ప్రమోషన్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సీనియర్ సహాయకులైన పిఎన్ఎస్ ప్రసన్న, వై.యల్లంనాయుడుకు పర్యవేక్షకులుగా (సూపరింటెండెంట్లు) ప్రమోషన్ కల్పిస్తూ జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ సోమవారం వారికి ఉత్తర్వులు అందించి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రమోషన్ ఉద్యోగులకు మరింత బాధ్యతను గుర్తు చేస్తుందన్నారు. విశాఖ నగర అభివృద్ధి, ప్రజలకు సేవలు అందించడంలో, విధుల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచాలని వారికి సూచించారు.

ప్రభుత్వ స్థలాన్ని అమ్మేసారు!



అమ్మేసిన ప్రభుత్వ స్థలంలోనిరేకుల షెడ్డు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు కేంద్రకారాగారాన్ని ఆనుకొని ఉన్న శ్రీకృష్ణాపురంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సంఘ నాయకులు, స్థానిక రాజకీయ నేతల అండదండలతో దర్జాగా అమ్మేసి జేబులు నింపుకున్నారు. స్థానిక ప్రాధమిక పాఠశాల సమీపంలో 100 గజాల ప్రభుత్వ స్థలం ఉండేది. దానిలో విద్యుత్ ట్రాన్స్‌ఫారం ఉండేది. దీనిపెసంఘ పెద్దల కన్ను పడింది. దీంతో ఏడాది క్రితం ఆ స్థలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటుకు తరలించారు. తరువాత ఆ స్థలంలో ఒక రేకుల షెడ్డును నిర్మించి, వేరే వ్యక్తికి రూ.19 లక్షలకు విక్రయించేసారు. ఇంత జరుగుతున్నా సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పట్టించుకోక పోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు అంటున్నారు. ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుని, గ్రామ అవసరాలకు వినియోగించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

జ్యూట్ యాజమాన్యంపై ఉదాసీన వైఖరి

ప్రజాశక్తి -భీమునిపట్నం : చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యం ప్రభుత్వ ఖజానాకు చెల్లించాల్సిన రూ.26 కోట్ల ఆస్తిపన్ను బకాయి వసూళ్లపై జివిఎంసి ఒకటో జోన్ అధికారులు ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నారని టిడిపి జిల్లా కార్యదర్శి పిట్ట సూరిబాబు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయలో కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.ఓ వైపు ఆస్తిపన్ను బకాయి ఉంటుండగానే, ఆయా భూములను అమ్ముకునేందుకు, లేఅవుట్లు వేసుకోవడానికి సంబంధిత జ్యూట్ యాజమాన్యానికి కొందరు అధికారులు ఎన్‌ఒసిలు ఇస్తున్నారని, విఎల్‌టిలు వేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జ్యూట్ యాజమాన్యం చెల్లించాల్సిన బకాయి వసూలు చేయడంతోపాటు కోట్లలో ఉన్న బకాయి వసూలులోనూ, జ్యూట్ భూములకు ఎన్‌ఒసి జారీ చేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు

బంగారమ్మ తల్లి గుడి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని విలాస్‌ఖాన్ పాలెం గ్రామంలో బంగారమ్మ తల్లి గుడిలో విగ్రహ పున:ప్రతిష్ఠ సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామపెద్దలు, భక్తులు సహకారంతో సోమవారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

అర్జీల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న జెడ్‌సి రాము

ప్రజాశక్తి- విశాఖపట్నం : జివిఎంసి ఐదో జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు అర్జీలు వచ్చాయని జెడ్‌సి బి.రాము తెలిపారు. ప్రజారోగ్య విభాగానికి సంబంధించి నాలుగు, టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి ఒక అర్జీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఇఇ ప్రసన్న రెడ్డి, ఎసిపి వెంకటరావు, ఎఎంహెచ్ఒ డాక్టర్. సునీల్‌కుమార్, ఆర్ఒ బాబూరావు, రాజ్యలక్ష్మి, ఎపిడిలు కృపానందం, పుణ్యవతి.పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కార్యాలయం సూపరింటెండెంట్‌కు పలు సమస్యలపై ఐదు అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఒకటి, ఇంజనీరింగ్, యుసిడి విభాగాలకు సంబంధించి చెరో రెండు అర్జీలు వచ్చాయని, వీటిని తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత శాఖాధిపతులకు పంపించినట్లు సూపరింటెండెంట్ తెలిపారు

ప్రజల్లో నమ్మకం పెంచేలా పనిచేయాలి

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే గంటా



వినతులు స్వీకిరస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రజా సమస్యలను సాధ్యమైనంత తొందరలో పరిష్కరించడం ద్వారా వారిలో ఉద్యోగుల పనితీరు పట్ల మరింత నమ్మకాన్ని పెంచాలని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం భీమిలి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని, స్వయంగా ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతివారం రెండు, మూడుకు మించి ఫిర్యాదులు రాకపోవడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలని స్థానిక అధికారులను ప్రశ్నించారు. అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసి, ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేసేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. త్వరలో మూడు ఉచిత వంట గ్యాస్ సిలెండర్లు, మహిళలకు ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణం హామీలను అమలు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె సంగీత్‌మాధుర్, జెడ్‌సి పిల్లి ప్రేమ ప్రసన్నవాణి, తహశీల్దార్ పిరామారావు, ఎంపిడిఒ ఎన్ హనుమంత రావు, ఇఒపిఆర్‌డి కనకల రమేష్ నాయుడు, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, టిడిపి మండల అధ్యక్షులు డిఎవన్ రాజు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

'ఆదర్శ' విద్యార్థుల పరిశ్రమల సందర్శన



ఇండస్ట్రియల్ విజిట్‌లో ఆదర్శ కాలేజీ బిబిఎ విద్యార్థులు

ప్రజాశక్తి-పెందుర్తి:: స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాల బిబిఎ విద్యార్థులు కో కరికులర్ యాక్టివిటీలో భాగంగా చోడవరం కోఆపరేటివ్ సుగర్స్, ఆపిల్ ఇంటీరియర్స్ పరిశ్రమలను సోమవారం సందర్శించారు. మేనేజ్‌మెంట్ విభాగం లెక్చరర్ బిఆర్.పరిమళ ఆధ్వర్యంలో 20మది బిబిఎ విద్యార్థులు ఆయా పరిశ్రమలను సందర్శించారని ప్రిన్సిపల్ ఎన్ఇ.ఫ్లోరా తెలిపారు. ఆయా కంపెనీల్లోని ప్రొడక్షన్, డిజైనింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ విభాగాల సందర్శన ద్వారా ఆయా పరిశ్రమల పనితీరుపై ప్రాక్టికల్ అనుభవం కలుగుతుందని, తద్వారా విద్యార్థులకు భవిష్యత్‌లో ఉపయోగపడుతుందని కంప్యూటర్ విభాగం లెక్చరర్ డిఎన్.ప్రదీప్ తెలిపారు. ఇండస్ట్రియల్ విజిట్‌తో పరిశ్రమలకు, విద్యాసంస్థలకు మధ్య అనుబంధం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తన అనుభవాలను, అనుభూతిని వెల్లడించారు. విద్యార్థులను కాలేజీ కరస్పాండెంట్ థియోఫిలస్ అభినందించారు.

వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో శ్యామ్ ప్రతిభ



శ్యామ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్, కరస్పాండెంట్

ప్రజాశక్తి-సీతమ్మధార : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో బుల్లయ్య జూనియర్ కాలేజికి చెందిన ఇంటర్ ఫస్టియర్ ఎంపిసి విద్యార్థి ఎన్.శ్యామ్‌కుమార్ రెండు విభాగాల్లోనూ బంగారు పతకాలను సాధించాడని కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ తెలిపారు. ఈనెల 20న అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఎన్‌టిఆర్ స్టేడియం, చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో అండర్ 17 విభాగంలో పాల్గొన్న శ్యామ్‌కుమార్, వెయిట్ లిఫ్టింగ్ 81 కేజీల విభాగంలోనూ,అలాగే పవర్ లిఫ్టింగ్ 83 కేజీల విభాగంలో రెండు బంగారు పతకాలను సాధించాండని తెలిపారు. పవర్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థి శ్యామ్‌కుమార్‌ను కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్‌తోపాటు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సోమేశ్వర్ రెడ్డి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై. శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ఎస్ లక్ష్మణరెడ్డి అభినందించారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి - గోపాలపట్నం : ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థికసాయం చెక్కులను సంబంధిత లబ్ధిదారులకు సోమవారం పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే పి.గణబాబు అందజేశారు. జివిఎంసి 52వ వార్డు శాంతినగర్‌కు చెందిన నిస్సి జాస్మిన్‌కు రూ 73,100, గణేష్ నగర్‌కు చెందిన మైపాల రామలక్ష్మికి రూ.23,920 వైద్యానికి ఆర్థికసాయం మంజూరుకాగా, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ నియోజకవర్గం కార్యనిర్వాహక కార్యదర్శి వాసుదేవరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ వై.తిరుమలరావు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపదను సృష్టించండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-ఆనందపురం : చెత్త నుంచి సంపదను తయారు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపిడిఒ డాక్టర్ వి జానకి సూచించారు. సోమవారం కుసులవాడ పంచాయతీలో సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. తడి పొడి చెత్తను వేరుచేసి ఎరువుగా తయారు చేయాలన్నారు. పాఠశాలలో మంచినీరు, మరుగుదొడ్లు, పరిసరాలను శుభ్రపరుచుకోవాలన్నారు. సచివాలయంలో పనులను వేగవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఆంజనేయులు, స్థానిక సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి శివాజీ పాల్గొన్నారు.

యుటిఎఫ్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి -గాజువాక : జిల్లాలో యుటిఎఫ్ బలోపేతానికి కృషి చేయాలని, ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి అప్పారావు, టిఆర్ అంబేద్కర్ అన్నారు. సోమవారం యుటిఎఫ్ గాజువాక మండలశాఖ ప్రధాన కార్యదర్శి సబ్బారపు నూకరాజు ఆధ్వర్యంలో శ్రీనగర్ ఎంపిపి స్కూల్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన దాసరి నాగేశ్వరావు, టిఆర్.అంబేద్కర్, గాజువాక, పెదగంట్యాడ మండలాల పరిధిలో జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన మహమ్మద్ రిజ్వాన్‌లను అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్‌వి. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ హక్, బి.సుగుణ, మండల కార్యదర్శులు రాంబాయి, అపరంది పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి -మధురవాడ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం మధురవాడ పౌర సంక్షేమ సంఘం తరపున రూ.50వేలు ఆర్థికసాయం డ్రాఫ్ట్‌ను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్య ప్రకాష్ సోమవారం అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ, పౌరసంక్షేమ సంఘం తరపున భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించి, ప్రజాసంక్షేమానికి అంకితం కావాలని ఆకాంక్షించారు. వరద బాధితులకు అండగా నిలిచిన సంఘం సభ్యులను అభినందించారు.

23 నుంచి రెవెన్యూ గ్రామసభలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 23 నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ పి. శ్యాంప్రసాద్ తెలిపారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఏమైనా అభ్యంతరాలుంటే గ్రామసభలో అర్జీ సమర్పించి రైతులు పరిష్కరించుకోవచ్చని సూచించారు. రెవెన్యూ గ్రామసభల షెడ్యూల్ వివరాలివి. ఈనెల 23న కనమాం, 26న ఎన్జీఆర్ పురం, 30న పాలవలస, వచ్చేనెల 1న చందక, 2న వేములవలస, 5న పెద్దిపాలెం, 6న వెల్లంకి, 7న కోలవానిపాలెం, 8న ముకుందపురం, 12న జిఎస్ అగ్రహారం, 13న తంగుడు బిల్లి, 14న గోరింట, 15న బిడి పాలెం, 16న గుడిలోవ, 19న పందలపాక, 20న తర్లువాడ, 21న జగన్నాధపురం, 22న మామిడిలోవ, 23న గంభీరం, 26న బాకురుపాలెం, 27న పేకేరులో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని, రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎఇఇ సురేష్ కుమార్ తెలిపారు. ఇఇ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 33/11 కెవి ఆనందపురం సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మత్తుల దృష్ట్యా, మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పాలవలస, తర్లువాడ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

శానిటేషన్ సూపర్‌వైజర్‌కు బెదిరింపులు

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి పారిశుధ్య విభాగంలో అవుట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న దమ్ము శ్రీనివాసరావుకు కొందరు తోటి సిబ్బంది బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కన్ను తీసేసినా అందరి తప్పులను ఎత్తి చూపుతున్నానని, ఇక చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన చెందుతున్నాడు. తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు.

రైతుబజారులో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి -కరాస: జివిఎంసి 52వ వార్డు మర్రిపాలెం రైతు బజారులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా రైతులు స్వచ్ఛందంగా రైతుబజారులోని పరిసరాలను, రైతుబజారు వెనుక ఖాళీస్థలంలోని పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఎస్టేట్ అధికారి కె.వరహాలు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛభారత్‌లో రైతుబజార్ సిబ్బంది, సహాయకుడు కె.ప్రతాప్, రైతులు, డ్వాక్రా మహిళలు, వ్యాపారులు పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న రైతులు, మహిళలు

నేడు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా



కార్మికులతో మాట్లాడుతున్న లక్ష్మణమూర్తి

ప్రజాశక్తి -ములగాడ :జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 22న మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు మల్కాపురం జోన్ గౌరవాధ్యక్షుడు ఆర్.లక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం జివిఎంసి 58, 59, 60 వార్డుల పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, 2018-20 వరకు జివిఎంసి కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల వేతనాల నుంచి కట్‌చేసిన రెండు శాతం ఇన్‌కం ట్యాక్స్‌ను సిఐటియు పోరాట ఫలితంగా తిరిగి కార్మికులకు చెల్లించారన్నారు. అయితే ఆయా మొత్తాలను నేరుగా కార్మికుల ఖాతాలకు కాకుండా ఎన్ఎస్ఎఫ్ గ్రూపుల ద్వారా చెల్లిస్తున్నారన్నారు. ఆయా మొత్తాలతోపాటు కార్మికుల వేతనాలను నేరుగా వారి అకౌంట్లకే జమ చేయాలన్న డిమాండ్‌తో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జోన్ అధ్యక్షులు కె.రమణ అధ్యక్షతన సమావేశంలో కమిటీ సభ్యులు బి.రాంబాబు ,డి.రాము, సూరి బాబు, కుమార్, కృష్ణ, రైల్‌బాబు, ఆదినారాయణ తిరుపతిరావు, గంగులు లక్ష్మి, శ్యామల అప్పలకొండ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నష్టపరిహారం



పరిహారం చెక్కును అందజేస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఎంవిపి కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ, మూడో అంతస్తు నుంచి జారిపడి దుర్మరణం పాలైన 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ప్రాంతానికి చెందిన బి ధనుంజయ్‌రావు కుటుంబానికి విశాఖ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో పోరాడి, సాధించిన రూ.10లక్షల పరిహారం చెక్కును సోమవారం సిఐటియు నాయకుడు బలివాడ వెంకటరావు అందజేశారు. ఈసందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ, అపార్టుమెంట్‌లో పనిచేస్తూ, ప్రమాదవశాత్తు మృతి చెందిన బాధితుని కుటుంబానికి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు పల్లా అనసూయ ఆధ్వర్యంలో కార్మికులంతా యజమానితో పోరాటం చేసి రూ.10 లక్షల పరిహారం బాధిత కుటుంబానికి అందేలా కృషి చేశారన్నారు. భవన యజమానితో చర్చలు జరిపిన వారిలో సిఐటియు నాయకులు రెల్ల మల్లేషు, దుంగ వెంకట్రావు, పొన్నాడ రాజేశ్వరరావు ఉన్నారు.

విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్యపరీక్షలు



కంటిపరీక్షలు చేస్తున్న డాక్టర్

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, దాకమర్రి జెడ్‌పి హైస్కూల్‌లో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 6వ తరగతి నుంచి 10 వ తరగతి విద్యార్థులకు స్థానిక ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ అధినేత కిషోర్ ఆర్థిక సాయంతో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో వైద్యపరీక్షలు చేసారు. అవసరమైన వారికి కంటిఅద్దాలు, ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లూరి పైడప్పడు, ఎంపిటిసి చెల్లూరి నగేష్‌బాబు, వైసిపి నాయకులు పొట్నూరు చంద్ర శేఖర్, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

స్టీల్ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకుందాం



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకుందామని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులపై జరుగుతున్న ఆర్థిక దాడిని నిరసిస్తూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ కార్మికులు ఉంటేనే పరిశ్రమ ఉందని, అలాంటి కార్మిక వర్గాన్ని అణగదొక్కాలని చూస్తున్న కేంద్రప్రభుత్వ చర్యలను తిప్పికొడతామన్నారు. హెచ్ఆర్ఎ తొలగింపు, విద్యుత్ ఛార్జీల పెంపు, ఇఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ తొలగింపు, దసరా బోనస్ లేకపోవడం, పీఎఫ్ డబ్బులు చెల్లించకపోవడం, సక్రమంగా జీతాలు చెల్లించకపోవడం వంటి ఉక్కు కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తున్న కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. స్టీల్ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడాలని, ప్లాంట్‌కు అవసరమైన ముడి సరుకును సమకూర్చి, పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి జరిగేలా చూడాలని ప్లకార్డులు పట్టుకుని నినదించారు. కార్యక్రమంలో టివికె. రాజు, డివి రమణారెడ్డి, పి శ్రీనివాసరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

ఐటి హిల్స్‌కు ఆర్‌టిసి బస్ సర్వీసులు



బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి-మధురవాడ: నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఐటి హిల్స్‌కు కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్‌టిసి బస్ సర్వీసులను సోమవారం ఎంపీ ఎం.శ్రీభరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఐటి ఉద్యోగులకు అందుబాటులో ఉండేలా మధురవాడ మీదుగా పాత గాజువాక, కూర్మన్నపాలెం, విజయనగరం, పెందుర్తి నుండి నాలుగు ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఆయా బస్సులు ప్రతీ పనిదినాల్లో ఆయా ప్రదేశాల నుంచి ఉదయం 8గంటలకు బయలుదేరి ఐటి హిల్స్ చేరుకుంటాయని, సాయంత్రం 5:40 నుండి 5:50 గంటల మధ్యలో మధురవాడ ఐటి హిల్స్ నుంచి బయలు దేరి ఆయా ప్రాంతాలకు చేరుకుంటాయన్నారు. ఐటి ఉద్యోగులకు ప్రభుత్వ సహకారంతో ఉచితంగా ఈ బస్ సర్వీసులను నడుపుతున్నట్లు వెల్లడించారు వీటితో పాటు విశాఖపట్నం సిటీ నుండి రెండు బస్సులను అదనంగా ఐటి. హిల్స్‌కు ప్రయాణికుల సౌకర్యార్థం నడుపుతున్నట్లు తెలిపారు. గాజువాక నుండి ఉదయం 07:40గంటలకు, మధ్యాహ్నం 03:40 గంటలకు అలాగే ద్వారకా బస్సు స్టేషన్ల నుంచి ఉదయం 05:40, 08:00, మధ్యాహ్నం 2:05 గంటలకు, అలాగే ఐ.టి. హెల్స్ నుంచి ఉదయం 6:30, 8:50, 09:00, మధ్యాహ్నం 3:00 సాయంత్రం 5:40 గంటలకు ఈ బస్సులు బయలుదేరుతాయన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు, జి.సత్యనారాయణ, డిప్యూటీ సిటిఎం. ఆర్‌టిసి సిబ్బంది ఐటి. హిల్స్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు సిర్లపాలెం విద్యార్థినులు



ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పిఇటి సత్యం

ప్రజాశక్తి -ఆనందపురం: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు సిర్లపాలెం విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బుత్తల సత్యం తెలిపారు..ఈ నెల 19న ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ ఖోఖో క్రీడాకారుల ఎంపికల్లో సిర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 9వ తరగతి విద్యార్థినులు పోతల వాగ్దేవి (రాముసేనిపేట), రేవతి (రేగానిగూడం) ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈ నెల 25 నుండి 27 వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరగబోవు రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా తరపున అర్హత సాధించారన్నారు. అలాగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోఅనకాపల్లి జిల్లాలో వచ్చేనెల 2, 3, 4 తేదీల్లో నిర్వహించే అండర్ 17 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పోతల వాగ్దేవి అర్హత సాధించిందన్నారు. ఖోఖో క్రీడలో సత్తాచాటి పాఠశాలకు, గ్రామానికి మంచి గుర్తింపు తెచ్చిన విద్యార్థినులను, అలాగే పీడీ సత్యంలను పాఠశాల హెచ్ఎం శారద, ఎస్ఎంసి చైర్మన్ కోరాడ గౌరి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, గ్రామసర్పంచ్ సిర్ల అప్పలనాయుడు,ఎంపిటిసి బోణి అప్పలనాయుడు, గ్రామ పెద్దలు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

నేడు విమ్స్‌లో రొమ్ము కేన్సర్‌పై ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఆరిలోవ : రొమ్ము కేన్సర్ అవగాహన మాసోత్సవాలను పురస్కరించుకొని విశాఖ విమ్స్‌లో మంగళవారం రొమ్ము కేన్సర్‌పై వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో రొమ్ము కేన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తామన్నారు. అవసరమైన బ్రెస్ట్ అల్ట్రా సౌండ్, బయాప్సీ తదితర వైద్య పరీక్షలను ఉచితంగా చేయడంతోపాటు మందులను కూడా ఉచితంగా అందజేస్తామన్నారు.. విమ్స్ ఆస్పత్రి ఒపి బ్లాక్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు రొమ్ము కేన్సర్‌పై ఉచిత వైద్యశిబిరా కొనసాగుతుందని,ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని, కేన్సర్‌పై తమకున్న అపోహలను నివృత్తి చేసుకోవాలన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సహాయం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కిడ్నీ బాధితుడు

ప్రజాశక్తి -ఆనందపురం: రెండు కిడ్నీలు పాడై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని వేములవలస గ్రామానికి చెందిన బోనేల ఈశ్వరరావుకు వైద్యఖర్చుల నిమిత్తం మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ 25 వేలు రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు.. మెరుగైన వైద్యం కోసం అవసరమైతే సంప్రదించమని సూచించాడు. ఈ సందర్భంగా సుభాష్‌చంద్రబోస్,, అసోసియేషన్ సిబ్బందికి . కిడ్నీ బాధితుడు కుమారుడు అనిల్‌కుమార్, సోదరుడు గురువులు కృతజ్ఞతలు తెలిపారు.

అమృతరావుకు ఘననివాళి



అమృతరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ప్రాణాలనే ఫణంగా పెట్టిన ఉక్కు సాధకుడు తమనంపల్లి అమృతరావు కృషి మరువలేనిదని గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య అన్నారు. సోమవారం ఉక్కునగరంలోని అమృతరావు పార్కులో అమృతరావు 105వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ మిషన్ కన్వీనర్ ఎవి..రమణా రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, యూ .రామస్వామి, కె. పరంధామయ్య, జి. ఆనంద్, విల్లా రామ్మోహన్‌కుమార్, రాంకుమార్, బి. అప్పారావు, బూసి వెంక రావు, పట్టా రామఅప్పారావు, జెర్రిపోతుల మోహన్‌కుమార్ , కోరాడ వెంకటరావు , గాంధీ మిషన్ చైర్మన్ టి.మోహన్‌గాంధీ, ఎస్. మోహన్ బాబు, సీ ప్రధానకార్యదర్శి కెవిడి.ప్రసాద్, బయ్యే మల్లయ్య, మాటూరిశ్రీనివాసరావు, పాల్తేటి పెంటారావు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-గాజువాక : ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. సోమవారం నెల్లిముక్కు గ్రామంలో ఆదానీ గంగవరం పోర్టు సిఎస్ఆర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆమె మాట్లాడుతూ, ప్రతిసోమవారం నెల్లిముక్కులో గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పులి రమణారెడ్డి మాట్లాడుతూ, ఈ వైద్యశిబిరంలో బిపి, సుగర్, థైరాయిడ్‌కు ఉచితంగా వైద్యసేవలు, మందులు అందిస్తారని, వైద్యసేవలకు వచ్చే రోగులు ఆధార్‌కార్డు జిరాక్సు, మొబైల్ నెంబర్లతో రావాలని సూచించారు.కార్యక్రమంలో 75వ వార్డు టిడిపి ప్రధాన కార్యదర్శి దొమ్మేటి పెరుమాల్, ముసిరి శ్రీనివాసరావు, పెద్దాడ సోము నాయుడు, ములకలపల్లి పెంటయ్య, విశాఖ పార్లమెంటరీ లీగల్ సెల్ మీడియా కో ఆర్డినేటర్ బస అప్పలరెడ్డి, దొమ్మేటి సోమునాయుడు, టేకేటి అప్పారావు, ఊరుకుటి అప్పలరాజు, మొల్లి నాగేశ్వరరావు, ఉరుకుటి అప్పారావు, కాకినాడ రాజుభాయ్, మొల్లి సోమునాయుడు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌కు ఘన స్వాగతం



ఉపముఖ్యమంత్రిని స్వాగతిస్తున్న జనసేన నేతలు

ప్రజాశక్తి -ఆనందపురం :విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో డయేరియా బాధితులను పరామర్శించడానికి వెళ్లిన జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆనందపురం జంక్షన్‌లో మండల జనసేన నేతలు ఘనస్వాగతం పలికారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గంలో గుర్ల వెళుతున్న పవన్‌కల్యాణ్‌కు స్వాగతించిన వారిలో జనసేన విశాఖ జిల్లా కార్యదర్శి మజ్జి శ్రీను, మండల ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి మూర్తి, ఉపాధ్యక్షులు శివకృష్ణ, బాలు, గోవింద్, ప్రశాంత్, రాజు , శంకర్, సోంబాబు ఉన్నారు.

అల్పపీడనం పట్ల అప్రమత్తం

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

అల్పపీడనం పట్ల జిల్లా యంత్రాంగాన్ని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అప్రమత్తం చేశారు. ఈ నెల 23 నుండి 26వ తేదీ వరకు దానా తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు జిల్లా యంత్రాంగాన్ని సంసిద్ధం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (08924-226599, 222888 నెంబర్లు) ఏర్పాటు చేసారు. అల్పపీడనం, వర్షాలు పట్ల జిల్లా కలెక్టర్ సోమవారం కలెక్టరు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, సీహెచ్ డబ్ల్యులతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆమె ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సమాచారం అందించాలని సూచించారు. మంచినీటి వనరులను, పైపులైనులను తనిఖీ చేయాలని, సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు యిబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, స్లాబ్‌లు పడిపోయే అవకాశం ఉన్న భవనాలు, మట్టి ఇళ్లలో ఉన్న వారిని సురక్షిత భవనాల్లోకి మార్చాలని కలెక్టరు ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితులకు అవసరమైన మందులు సిద్ధం చేసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తుపాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

సబ్బవరం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 నుండి 24 వరకు తుఫాను ఉన్నట్లుగా హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని అన్ని లోతట్టు ప్రాంతాలలో ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

రైతులకు తుపాను హెచ్చరిక

అనకాపల్లి : బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడి తుపానుగా మారే అవకాశం ఉన్నందున ఈనెల 21 నుంచి 25 వరకు భారీ వర్షాల కారణంగా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాస్త్రవేత్తలు, తుపాను హెచ్చరికల కేంద్రం సూచనల మేరకు లోతట్టు ప్రాంత పంటలను ముంపు నుంచి కాపాడుకునేందుకు పొలముగట్లకు గండ్లు కొట్టి నీటిని కిందకి పంపాలని సూచించారు. పొలాల్లో రసాయనిక ఎరువులు, మందులు వినియోగాన్ని తాత్కాలికంగా విరమించాలన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ నెంబర్ 9492353994కు ఫోన్ చేయాలని కోరారు.

దేవరాపల్లి : తుపాన్ నేపథ్యంలో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ లక్ష్మీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అత్యవసర పరిస్థితులు పరిస్థితులు 7032521509 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

అర్జీదారులతో నేరుగా మాట్లాడాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరే అర్జీదారులతో అధికారులు నేరుగా మాట్లాడాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ ఆదేశించారు. జిల్లాలో అర్జీల పరిష్కారం పరిస్థితిని జిల్లా కలెక్టరు సమీక్షించారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా అర్జీదారులతో మాట్లాడి వారు సంతృప్తిచెందే విధంగా పరిష్కారం చూపాలని సూచించారు. సమస్య పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను వివరించాలన్నారు. జిల్లా కలెక్టరు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టరుతో పాటు జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, డిఆర్ఓ బి.దయానిధి, ఎస్డిసి సుబ్బలక్ష్మి, హౌసింగు పిడి శ్రీనివాస్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజలు వ్యక్తిగత, సామాజిక అంశాలపై 206 అర్జీలు అందజేసారు. రెవిన్యూశాఖకు సంబంధించి 126, పంచాయతీ రాజ్ శాఖకు 19, పోలీసుశాఖకు 10, మునిసిపల్ శాఖకు 6, సర్వే శాఖకు 6, గ్రామీణాభివృద్ధికి 5, ప్రోహిబిషనుశాఖకు 4, ఇతర శాఖలకు 30 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 32 ఫిర్యాదులు..

ప్రజా సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన 32 ఫిర్యాదులలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు తదితర ఫిర్యాదులు ఉన్నాయి. ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్ రావు పాల్గొన్నారు.

పలు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన వడ్డాది కెజిబివి విద్యార్థినులు

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది కేజీబీవీకి చెందిన పలువురు విద్యార్థినులు ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వివిధ విభాగాలలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు 16 మంది ఎంపికయ్యారు. అండర్-19 బాస్కెట్ బాల్ పోటీలకు కె.బాంధవ్య, అండర్-19 నెట్‌బాల్ పోటీలకు ఎ.వెంకట పద్మ, వి.జ్ఞానేశ్వరి, ఎం.శ్యామల, అండర్-19 హ్యాండ్ బాల్ పోటీలకు కె.కార్తిక, ఎస్.యమున, పి.తిరుమల, జె.వాణి, అండర్-19 ఫుట్‌బాల్ పోటీలకు ఎన్.పూజ, ఎ.దీపిక, వి.ఊర్మిళ ఎస్.హాసిని, అండర్-19 టెన్నికాయిట్ పోటీలకు నిశ్విక, అండర్-17 హ్యాండ్ బాల్ పోటీలకు హేమ, అండర్ 14 హ్యాండ్ బాల్ పోటీలకు ఎస్.దివ్య, జే.లావణ్య ఎంపికైనట్లు కెజిబివి ప్రిన్సిపల్ కె.అన్నపూర్ణ తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను, ప్రిన్సిపల్ అన్నపూర్ణను, పిడి ప్రవళికను, ఎస్ఎంసి ఛైర్మన్ వై.సత్యవేణి, జనసేన నేత వై.రామ్మూర్తి, గ్రామ పెద్దలు అభినందించారు.



కశింకోట జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు

వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలకు..

కశింకోట : నర్సీపట్నం ఎన్‌టిఆర్ స్టేడియంలో జరిగిన 68వ ఎస్‌జిఎఫ్ ఉమ్మడి జిల్లాల వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బాలికల అండర్ 17 విభాగంలో కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యార్థి సిహెచ్.వైశాలి రెండు క్రీడా అంశాల్లో స్వర్ణ పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే బాలుర అండర్ 17 విభాగంలో ఎన్.ముకేశ్ కూడా వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకాలు, వై.డాన్ ప్రసాద్ పవర్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆచంట రవి తెలిపారు. ఈ మేరకు ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సోమవారం పాఠశాల హెచ్ఎం రవి, విద్యా కమిటీ ఛైర్మన్ నక్కా నాగమణి, సుధారాణి, బి.అప్పారావు, ప్రభాకర్, శర్మ, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు..

అనకాపల్లి : నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అనకాపల్లి మండల మామిడిపాలెం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి వి.ధనరాజ్ 102 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు హైస్కూల్ హెచ్ఎం హెచ్‌బి శ్రీధర్, పిడి గౌరీ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చిన్నబ్బాయి, ఉపాధ్యాయులు బాబు, సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, శ్రీను, ఉమా, లక్ష్మీ కరుణ జ్యోతి, స్వామి, నారాయణరావు, వసంతరావు, ప్రసాద్, కెనడి తదితరులు సోమవారం అభినందించారు.



మామిడిపాలెం జెడ్‌పి స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

చెస్ పోటీలకు..

మునగపాక : అనకాపల్లి మున్సిపల్ హైస్కూల్లో ఇటీవల జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి చెస్ పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థి ఆడారి మౌనిక అన్నపూర్ణ ప్రతిభ కనబర్చి ఈ నెల 27, 28, 29 తేదీలలో బాపట్ల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు మౌనిక అన్నపూర్ణను పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్ సన్యాసిరావు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ సూర్యచంద్ర రామారావు, బొడ్డేడ గిరిజ, స్కూల్ కమిటీ మెంబర్స్, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.



మునగపాక హైస్కూల్ విద్యార్థులు



పతకాలు చూపుతున్న విద్యార్థులు

కరాటీ పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కశింకోట : తునిలో జపాన్ మార్షల్ ఆర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏపి ఇన్విటేషన్ కరాటీ పోటీలో కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన ఎండిఎస్.లక్ష్మి ప్రసన్న, వై.తేజేశ్వరి బంగారు పతకాలు, జి.మనోజ్ శశిధర్, ఎస్.విశాల్, పి.కుసుమ కిరణ్, జిలికతా గ్రేస్ వెండి పతకాలు, బి.శృతి కాంస్య పతకం సాధించారు. వారిని ప్రిన్సిపాల్ రూపనంది, అకడమిక్ ఇన్‌చార్జ్ చంద్రమౌళి, కరాటీ కోచ్ సూరి అప్పారావు. పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

వాలంటీర్లకు బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రామ/వార్డు వాలంటీర్లకు బకాయిల పడ్డ నాలుగు నెలల గౌరవ వేతనం చెల్లించాలని, వారిని విధుల్లో కొనసాగించాలని కోరుతు ఎపి వాలంటరీ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు రాజం దొరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద వాలంటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తాము అధికారంలోకి వస్తే వాలంటీర్ పదివేల రూపాయిలు గౌరవ వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని దొరబాబు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి ప్రవీణ్, హసీనా, సురేష్, విజయ్, లావణ్య, చంద్రిక, ఉమా భానుప్రియ, లావణ్య,దేవి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్, అంగన్వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని కొత్తూరు నర్సింగరావుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను, అంగన్వాడి కేంద్రాన్ని టిడిపి 84 వార్డు ఇన్చార్జి మాదంశెట్టి నీలబాబు సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, చూచుకొండ రమణ, జి సురేష్ పాల్గొన్నారు.

పాల సేకరణ ధర తగ్గింపుపై ఆగని నిరసనలు

ప్రజాశక్తి -మునగపాక : విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాల ధర తగ్గించడంపై రైతుల నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని అరబ్బుపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామ రైతు సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో పాల కేంద్రం ఎదుట ఆందోళన చేపట్టారు. తక్షణమే పాల సేకరణ రేట్లు పెంచాలని, అవినీతి దుబారాను అరికట్టాలని, బోనస్ అందజేయాలని, ఫీడు రేట్లు ధర తగ్గించాలని ప్లకార్డును పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ మాట్లాడుతూ వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ప్రత్యామ్నాయంగా పాడిని నమ్ముకుంటే ఆవు పాలు లీటర్‌కు రూ.3 తగ్గించడం దారుణమన్నారు. దీనిపై ఈ నెల 29న గాజువాకలోని విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాడి రైతులు కొలమరశెట్టి నాగేశ్వరరావు, కోరుమల్లి చిన్న రామునాయుడు, కోయలాడ నరసింహారావు, ఎల్లపు సూరిబాబు, మల్ల నాగేశ్వరరావు, బొడ్డేడ సంతోష్, బొడ్డేడ రామప్పరావు, కెవి నూకేశ్వరరావు పాల్గొన్నారు.

పైడివాడ అగ్రహారంలో...

సబ్బవరం : మండలంలో పైడివాడ అగ్రహారం విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రం ఎదుట సోమవారం ఉదయం పాడి రైతులు నిరసన తెలిపారు. పాల సేకరణ ధరలు తగ్గించి విశాఖ డెయిరీ యాజమాన్యం తమకు తీవ్ర అన్యాయం చేస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తగ్గించిన పాల ధరలను తక్షణమే పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. తగ్గించిన పాల ధరలను తక్షణమే పెంచకపోతే విశాఖ డైయిరీకి పాల సరఫరాను నిలిపివేస్తామని రైతులు హెచ్చరించారు.



పైడివాడ అగ్రహారంలో నిరసన తెలుపుతున్న రైతులు

ఉరకగెడ్డ నిర్వాసితులకు ఆర్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి

-నష్టపరిహారంపై సమగ్ర విచారణ జరపాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-చోడవరం

వి.మాడుగుల మండలం శంకరం పంచాయతీ, ఉరకగెడ్డ ప్రాజెక్టు నిర్వాసితులకు వెంటనే ఆర్ఆర్ ప్యాకేజీ ద్వారా పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, నాయకులు కె.భవాని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గిరిజనులతో కలిసి ఉరకగెడ్డ ప్రాజెక్టు ప్రాంతాన్ని సిపిఎం నాయకులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉరకగెడ్డ రిజర్వాయరు నిర్మాణం జరిగినప్పుడు బొడ్డరేవు, చినబొడ్డరేవులో 56 గిరిజన కుటుంబాలకు చెందిన భూములు ముంపునకు గురికాగా, వారికి ఆర్ ఆర్ ప్యాకేజీ అమలు కోసం ప్రభుత్వం 2005 ఏప్రిల్ 8న జీవో నెంబరు 68ని విడుదల చేసిందని తెలిపారు. దీని ప్రకారం బాధిత 56 కుటుంబాలకు ఇంటి స్థలాలతో పాటు అన్ని రకాల రాయితీలు కలుపుకొని ఆర్ఆర్ ప్యాకేజీ ప్రకారం రూ.5 కోట్లు మంజూరు చేస్తామని ఆ జీవోలో పేర్కొన్నారని గుర్తు చేశారు. కాని అధికారులు కేవలం ఇంటి స్థలం ఇచ్చి, ఇందిరమ్మ స్కీమ్ ఇల్లు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారని చెప్పారు. గిరిజన బాధితులకు నష్ట పరిహారం ఇవ్వకుండా మోసం చేసి, అధికారులు భారీ కుంభకోణానికి పాల్పడినట్లు అర్థమవుతుందని విమర్శించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఈ సమస్యను ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి దృష్టికి గిరిజనులు తీసుకెళ్లారని, దీనిపై జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు స్పందించాలని కోరారు. గిరిజనులకు నష్టపరిహారం చెల్లించకుంటే దశలవారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక గిరిజనులు మువ్వల జానీ, బుసరి మల్లుదొర తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నేతలు, గిరిజనులు

అభిజిత్ కార్మికుల ఆందోళన తాత్కాలిక నిలుపుదల

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అభిజిత్ పరిశ్రమ అక్రమ లే అఫ్ ఎత్తివేసి కార్మికులకు యథావిధిగా పనులు కల్పించాలని కోరుతూ వారం రోజులుగా చేస్తున్న ఆందోళనను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము తెలిపారు. మూడు రోజుల్లో కార్మికుల డిమాండ్లను పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున మళ్లీ ఆందోళన నిర్వహిస్తామని రాము హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం అభిజిత్ పరిశ్రమ ఎదుట ఆందోళన శిబిరం వద్ద రాము మాట్లాడారు. వెయ్యి మంది కార్మికులను రోడ్డున పడేసిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, అచ్చుతాపురం మండల తహశీల్దార్, స్పెషల్ ఎకనామిక్ జోన్ డెవలప్మెంట్ కమిషనర్, లేబర్ అధికారులు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అక్రమ లే ఆఫ్ ప్రకటించిన యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అభిజిత్ పరిశ్రమను యథావిధిగా నడపాలని, బకాయి వేతనాలు, బోనస్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అభిజిత్ కార్మికులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సోమవారం ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం ఎస్సై శివ కార్తికేయ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయుని గౌరవించడం, ఎవరైతే అలవర్చుకుంటారో వారు ఉన్నత స్థానానికి ఎదుగుతారని చెప్పారు. మొదటి సంవత్సరం విద్యార్థులను ర్యాగింగ్ చేసే చేస్తే కళాశాల అధ్యాపకులకు, పోలీసులకు తెలియజేయాలని కోరారు. అనంతరం కార్తికేయను అధ్యాపక బృందం విద్యార్థులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రత్నభారతి, డి.మాల్యాద్రి, బిచ్చమ్మ, పాల్గొన్నారు.

వివేకానంద విద్యా సంస్థకు అబ్దుల్ కలాం అవార్డు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట శ్రీవివేకానంద విద్యాసంస్థలు ద్వారా ఉత్తమ విద్యా సేవలు అందిస్తున్నందుకు ఆ సంస్థ వ్యవస్థాపకులు మళ్ళ జగదీష్- శైలజ దంపతులకు గుంటూరుకు చెందిన సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ సోమవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రతిభా అవార్డును గుంటూరు జరిగిన కార్యక్రమంలో అందజేసింది. ఈ అవార్డు రావడంపట్ల వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు మళ్ళ జగదీష్, మళ్ళ శైలజ దంపతులను అభినందించారు.

పంచాయతీల్లో గ్రామ సచివాలయాలను విలీనం చేయాలి

ప్రజాశక్తి-పరవాడ : గ్రామ పంచాయతీలలో గ్రామ సచివాలయాలను విలీనం చేయాలని మండలంలోని ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు చింతకాయల సూజాత, ఇతర సర్పంచ్‌లు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి ఆ సచివాలయ సిబ్బందిని గ్రామ పంచాయితీకి అనుసంధానం చేయాలని కోరారు.

గురుకుల విద్యార్థులకు అచీవ్‌మెంట్ అవార్డులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రామ్ చరణ్, భవాని ప్రసాద్‌లు ఐటీ ఒకేషనల్ విభాగంలో స్పెషల్ అచీవ్‌మెంట్ అవార్డు పొందారు. జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్‌కి అర్హత సాధించారు. ఈ నెల 18న కొక్కిరాపల్లిలో జరిగిన సైన్స్ ఫెయిర్, ఫ్యూచర్ ఆన్ ఎగ్జిబిషన్ అండ్ కాంపిటీషన్స్ ఈ అవార్డును కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.రఘు తెలిపారు. భూమి ఉపరితల వాతావరణంలో తక్కువ రేడియేషన్ ద్వారా మానవులను, జంతువులను, పక్షుల వాటి జీవితకాలం ఎలా పెంపొందించుకోవచ్చు అనే కాన్సెప్ట్ ద్వారా స్పెషల్ అచీవ్‌మెంట్ అవార్డును విద్యార్థుల సొంతం చేసుకున్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఒకేషనల్ ఐటీ ఇన్స్ట్రక్టర్ లక్ష్మణ్‌ను ప్రిన్సిపాల్ రఘు, గురుకుల అధికారిని ఎస్. రూపావతి, చైర్మన్ నరసింహమూర్తి అభినందించారు.



సైన్స్ ఫెయిర్‌లో ఎంపికైన ప్రాజెక్టును చూపుతున్న విద్యార్థులు

జిల్లా ఎస్‌పిగా తుహిన్ సిన్హా బాధ్యతలు స్వీకరణ



పోలీసు అధికారులతో సమావేశమైన ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా ఎస్పీగా తుహిన్ సిన్హా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన విశాఖపట్నం సిటీ డిసిపి-2గా పని చేసిన సాధారణ బదిలీల్లో భాగంగా అనకాపల్లి జిల్లా ఎస్‌పిగా వచ్చారు. 2017 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన తుహిన్ సిన్హా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీగా 2023- 2024 సంవత్సరంలోనూ, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో నర్సీపట్నం సబ్ డివిజన్ ఏఎస్పీగా 2021-22 సంవత్సరంలో పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటామని, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పటిష్టంగా ఎన్ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తామని చెప్పారు. సైబర్ క్రైమ్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ తదితర సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఇందుకు పోలీస్ అధికారులు, మీడియా సహకారం అందించాలని కోరారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

అనంతరం పోలీస్ అమరవీరుల స్మృతి స్థూపం వద్ద గౌరవ వందనం చేసి పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్ రావు, డిఎస్‌పిలు బి.అప్పారావు, కెవి.సత్యనారాయణ, పి.నాగేశ్వరరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

అనకాపల్లి జిల్లా ఎస్పీగా తుహిన్ సిన్హా బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్‌ని ఆమె కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ తుహిన్ సిన్హాకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జెసి జాహ్నవి, వివిధ శాఖల అధికారులు

వృద్ధుల పోషణ వారి పిల్లలదే

- కలెక్టర్ విజయకృష్ణన్

- ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అనకాపల్లి

తల్లిదండ్రుల పోషణ బాధ్యత వారి పిల్లలదేనని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ అన్నారు. కలెక్టరు కార్యాలయంలో సోమవారం వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం-2007 ప్రచార పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ చట్టం పై అవగాహన కార్యక్రమాలు, ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రుల పోషణ బాధ్యత వారి వారి పిల్లలకు లేదా చట్టంలో నిర్వచించబడిన బంధువులకు ఉంటుందన్నారు. ఎవరైనా వయోవృద్ధులు వారి పిల్లలతో వేధింపులు పడుతున్నట్లయినా, వారి పోషణ నిర్లక్ష్యం చేసినా సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి వారికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ చట్టంపై అవగాహన కొరకు గ్రామ సచివాలయాలు, బస్టాండులు, హాస్పిటల్స్, పబ్లిక్ ప్లేసులు, రెవిన్యూ, పంచాయతీ రాజ్ కార్యాలయాలలో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వివిధ ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జెబివి.జగదీష్ మాట్లాడుతూ వయోవృద్ధులు తమ పిల్లల నుండి పోషణ ఖర్చులను పొందే హక్కు ఉంటుందని, పిల్లలకు ఆస్తిని ఇచ్చినపుడు వారిని సరిగా చూడకపోతే ఆస్తిని తిరిగి పొందేవిధంగా నిబంధనను జోడించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి బి. దయానిధి, ఎస్సిసి సుబ్బలక్ష్మీ, హౌసింగు పిడి శ్రీనివాసరావు, జిల్లా ట్రెజరీ అధికారి సుభాషిణి, వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కెప్టెన్ అప్పారావు, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ శరగడం నూకరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని మంగళాపురం గ్రామంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. అక్రమంగా లారీల్లో ఇసుక తరలింపు శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం ప్రచురించిన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. కొంతకాలంగా గ్రామానికి సమీపంలోని ఏరు నుండి ఇసుకను అధిక సంఖ్యలో బల్లతో తరలించి పోగులు పెట్టి లారీలతో అక్రమ రవాణా చేస్తున్నారు. దీనిపై ప్రజాశక్తి ప్రచురించిన వార్తకు మండల రెవెన్యూ అధికారులు స్పందించారు. వీఆర్వో నాగరాజు ఆధ్వర్యంలో ఏరు నుండి ఇసుకను ఎడ్లబండ్ల ద్వారా మెయిన్ రోడ్డుకు తరలించే దారిని అడ్డంగా జెసిబితో తవ్వించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తహశీల్దార్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదు

- విచారణకు స్వీకరించిన లోకాయుక్త న్యాయస్థానం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని నీటి ప్రవాహ భూములకు భూ రీ సర్వేలో నష్టం కలిగించారంటూ తహశీల్దారు దొంకాడ శాంతి భూషణరావుపై ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త న్యాయస్థానానికి చిప్పాడ అప్పారావు ఈ ఏడాది ఆగస్టు 13న ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును లోకాయుక్త న్యాయస్థానం విచారణకు స్వీకరించి కంప్లైంట్ నెంబర్ 1097/2024/ బి1 నమోదు చేసింది. సంబంధిత ఫిర్యాదుపై విచారణ నివేదికను సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. మండలంలోని ప్రభుత్వ భూములు, నీటి ప్రవాహ భూములు, సామూహిక భూముల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఈ ఏడాది మే నెల 15న విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల, రెవిన్యూ, సర్వే అధికారులకు, పరవాడ మండల రెవిన్యూ, సర్వే అధికారులకు, సంబంధిత ప్రభుత్వ శాఖల ప్రాంతీయ కార్యాలయాల అధికారులకు, రాష్ట్ర ఉన్నతాధికారులకు చిప్పాడ అప్పారావు సమాచార హక్కు చట్టం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఏం చర్యలు చేపట్టారనే విషయమై ఈ ఏడాది ఆగస్టు 19న సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరగా సంబంధిత ప్రభుత్వ శాఖల వారు సమాచారమిచ్చేందుకు నిరాకరించారించారు. సర్వే నిబంధనలు పాటించని, నీటి ప్రవాహ భూములకు భూముల రీసర్వేలో నష్టం కలిగించిన తహశీల్దారు దొంకాడ శాంతి భూషణరావుకు వ్యతిరేకంగా చిప్పాడ అప్పారావు ఈ ఫిర్యాదు చేశారు.

గ్రామాల్లో పల్లె పండగ

ప్రజాశక్తి-కె.కోటపాడు : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పైడంపేట, మేడిచర్ల, ఆర్‌వై.అగ్రహారం, ఎ.కోడూరు, చౌడువాడ, గొండుపాలెం తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి సోమవారం శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, నాయకులు సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము, కుంచ అంజిబాబు, కన్నూరు సూర్యనారాయణ, బండారు నరసింహనాయుడు, కాంట్రాక్టర్ అర్జున్, డిటి రమేష్‌బాబు, ఏవో అప్పలరాజు, ఎంఈఓ డివిడి.ప్రసాద్ పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని జమాదులపాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి శేషు ఆధ్వర్యంలో సోమవారం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో కొన్ని వీధి దీపాలు పనిచేయక గ్రామస్తులు ఇబ్బంది పడేవారని సర్పంచ్ తెలిపారు.

నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధికి కృషి

-పాఠశాలలకు నిధుల మంజూరు-స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నాతవరం:మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం పెద్ద గొల్కొండ పేట నుండి వెదురుపల్లి రోడ్డుకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఏర్పడిన కొద్ది రోజుల్లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలికామన్నారు. నర్సీపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి కృషి చేస్తున్నానని ఆయన అన్నారు. తాండవ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.2900 కోట్లు రూపాయలతో ప్రతిపాదనలు ముఖ్యమంత్రికి పంపగా సానుకూలంగా స్పందించారన్నారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వివి రమణ, జనసేన పార్టీ నాయకుడు సూర్యచంద్ర, మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, మాజీ జడ్పిటిసి కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, విజయ్ కుమార్, మండల పార్టీ నాయకులు చిట్టిబాబు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి నిధుల మంజూరు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష అధికారులతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అనకాపల్లి ఈఈ నరసింగరావు, నర్సీపట్నం డివైఈఈ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యన్న మీడియాతో మాట్లాడుతూ, నియోజకవర్గంలోని పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణానికై ఎన్ఆర్‌జీఎస్ నిధుల నుంచి మూడు మండలాలకు గాను 29 పనుల కోసం మూడు కోట్ల 82 లక్షల రూపాయలు మంజూరైనట్లు స్పీకర్ తెలిపారు. పాఠశాల ప్రహరీ గోడల నిర్మాణ పనులు వెంటనే



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

ప్రారంభించాలని ఆదేశించారు. స్థానిక నాయకులు ఈ పనులను దగ్గరుండి పర్యవేక్షించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

సిఐ గోవిందరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :నర్సీపట్నం టౌన్ సీఐ గొల్లంగి గోవిందరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం గోవిందరావు విశాఖ కమిషనరేట్ లో పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. గతంలో రోలుగుంట, పరవాడ స్టేషన్లో ఎసైగా నర్సీపట్నం, ఎలమంచిలిలో ఇంటిలిజెన్స్ ఎస్ఐగా పనిచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గంజాయి, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నర్సీపట్నంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం దిశగా చర్యలు చేపడతామన్నారు.



అలరించిన భక్తి గీతాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని కాగిత గ్రామంలో కనకదుర్గ ఆలయ 15వ వార్షికోత్సవ వేడుకలను కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం ఏకహం భజన కార్యక్రమం నిర్వహించారు. భజన బృంద సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో అలరించాయి. మంగళవారం ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయానికి అందంగా పూల అలంకరణ చేశారు.



గీతాలు ఆలపిస్తున్న భక్తులు



పుస్తకాలను ఇస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

విద్యార్థులకు పుస్తకాల వితరణ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్.ఎమ్.ఎమ్.ఎస్. పరీక్షల కు హాజరయ్యే ఎనిమిదవ తరగతి విద్యార్థులకురాజ్ కమల్, వింగ్స్ ఫౌండేషన్ సంస్థలు పుస్తకాలు సమకూర్చాయి. ఈ మేరకు సోమవారం హెచ్ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆ సంస్థ వ్యవస్థాపకులు ఎర్రమిల్లి వెంకట జయరాం, కార్యదర్శి జయప్రకాష్ చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సంధర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ, రాజ్ కమల్, వింగ్స్ ఫౌండేషన్ సేవలు ఎనలేనివని కొనియాడారు. సంస్థ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారి, ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఫల్గుణరావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ధరల అదుపులో ప్రభుత్వాలు విఫలం

సిపిఎం మండల మహాసభలో ఆ పార్టీ నేతలు వెంకన్న, కోటేశ్వరరావు

ప్రజాశక్తి -గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట అల్లూరి పార్కులో సోమవారం గొలుగొండ మండలం సిపిఎం 3వ మహాసభ జరిగింది. ముందుగా జెండా అవిష్కరణ చేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరిస్తుందన్నారు. ఉపాధి హామీ, అటవీ హక్కుల చట్టం, పౌర హక్కులు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. మైనింగ్‌కు అడవిని ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేస్తున్నారని మండిపడ్డారు. వీటన్నింటిని పోరాటాలతోనే కాపాడుకోవాలన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ.కోటేశ్వరరావు మాట్లాడుతూ, ధరలు ఆకాశానికి అంటుతున్నా వాటిని అడ్డుకట్ట వేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. నిత్యావసరాల ధరలు తగ్గించమంటే మద్యం ధరలు తగ్గిస్తున్నారన్నారు. రానున్నా రోజుల్లో ప్రజా పోరాటాలతోనే ఎదుర్కొవాలన్నారు. సిపిఎంతోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. డిసెంబరు 20నుండి 22 తేదీల్లో నర్సీపట్నంలో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మండల కమిటి ఎనిమిది మందితో ఎన్నికైంది. మండల కార్యదర్శిగా టి.రాజుబాబును ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న వెంకన్న(ఇన్‌సెట్‌లో మండల కార్యదర్శి రాజుబాబు)

రీ సర్వే సమస్యలపై అర్జీలు స్వీకరణ



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని సుంకపూరు రెవెన్యూ పరిధి జల్లూరు గ్రామంలో సోమవారం రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు తిరుమలబాబు,టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాశీనాయుడు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో నిర్వహించిన రీ సర్వేతో రైతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుందన్నారు. రైతులు ఆందోళన చెందవలసిన పనిలేదని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తహసిల్దార్ తిరుమల బాబు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో రి సర్వేపై ఫిర్యాదులు అధికంగా అందుతున్నాయని, ప్రధానంగా సర్వే నెంబర్లు మార్పు, విస్తీర్ణం తేడాలు, మార్పు వంటి ఫిర్యాదులతో పాటు, పేర్ల వివరాలు, ఆధార్ నెంబర్లు వంటి సమస్యలు వస్తున్నాయన్నారు. గ్రామంలో 975 ఎకరాల భూమికి సర్వే నిర్వహించగా ఇందులో ప్రభుత్వ భూమి 284 ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. పల్లపు భూమి 245 ఎకరాలు, మెట్ట భూమి 446 ఎకరాల ఉండగా 1585 ఎల్ పి ఎం ఏర్పాటు చేశారన్నారు. 980 మంది ఖాతాదారులు ఉండగా సర్వే నిమిత్తం 336 సర్వే రాళ్ల ప్లాంటేషన్ చేసినట్లు తెలిపారు. జల్లూరు గ్రామంలో సోమవారం 56 ఫిర్యాదులు అందగా వాటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉర్దవరావు, మండల సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అసకపల్లి పంచాయితీ శివారు ఎరుకు నాయుడు పాలెం గ్రామంలో సోమవారం జరిగిన రెవిన్యూ సదస్సులో భూ రీ సర్వే సమస్యలపై 82 అర్జీలు అందినట్లు స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి గణేష్, మండల సర్వేయర్ అప్పారావు, సర్పంచ్ కర్రి నర్సింగరావు పాల్గొన్నారు.

తహశీల్దారు, టిడి లేకుండానే రెవెన్యూ గ్రామసభలు

బుచ్చయ్యపేట : మండలంలోని చింతపాక, పిపి అగ్రహారం గ్రామాల్లో సోమవారం తహశీల్దారు, డిప్యూటీ తహశీల్దారు లేకుండా రెవెన్యూ రెవెన్యూ గ్రామసభలు జరిగాయి. వీఆర్వోల ఆధ్వర్యంలో ఈ సభలు జరగడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దాకార నాగేశ్వరి దేవి, సర్పంచ్ గోలజాన శ్రీను, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు విఆర్ఓ రమణ పాల్గొన్నారు.

ఎంపిడిఒకు సత్కారం

ప్రజాశక్తి-గొలుగొండ: ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన మేరీరోజ్‌ను మండల పంచాయతీ కార్యదర్శులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు అందజేశారు. అనంతరం ఎంపిడిఒ వారితో సమావేశమై మాట్లాడారు.



ఎంపిడిఒను సత్కరిస్తున్న కార్యదర్శులు



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకం ద్వారా గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో డి సీతారామరాజు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం వెలుగు ఏపీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో విఓఏల నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సీతారామరాజు మాట్లాడుతూ, ఉల్లాస్ పథకం ద్వారా గ్రామంలో నిరక్షరాస్యులను పంచాయతీకి 20 మంది చొప్పున గుర్తించి, ఎంపిక చేసిన వారికి ఒక టీచర్ వాలంటీర్‌గా ప్రాథమిక విద్య, ఆర్థిక విద్య, డిజిటల్ విద్య పై శిక్షణ ఇవ్వవలసిన ఉంటుందన్నారు. వివఓలు నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ముఖ్య భూమిక పోషించాలన్నారు. అవినీతికి, అక్రమాలకు ఆస్కారం లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో సీసీ లు రాజు, అప్పారావు, కోటి, సన్యాసిరావ్, ప్రసాద్, దీవినమ్మ, గీత పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న డిపో మేనేజర్

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో సమస్యలపై వినతి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్.పురం మేజర్ పంచాయతీ ఆర్టీసి కాంప్లెక్స్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేకపోతే గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడతామని సర్పంచ్, వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత అన్నారు. సోమవారం నర్సీపట్నం డిపో మేనేజర్ ధీరజ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గతంలో ఒక మంచి ఉద్దేశ్యంతో గ్రామ పంచాయతీ నుండి సుమారు 20సెంట్ల స్థలాన్ని కేటాయించి ఆర్టీసి కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టారన్నారు. కాంప్లెక్స్ ఆవరణలో ఆర్టీసి యాజమాన్యం షాపులు నిర్మించి ప్రయాణికుల సౌకర్యాలను పట్టించుకో లేదన్నారు. ప్లాట్ ఫామ్ నిర్మాణం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై డిఎం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గొల్తి తాతాజీ, కర్రి ప్రకాష్‌రావు, కాళ్ళ సత్తిబాబు, కర్రి నరసియ్య మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ రమణ

అధికారులతో ఆర్‌డిఒ సమావేశం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో వివి రమణ నర్సీపట్నం డివిజన్ కేంద్రంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తుఫానుపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎటువంటి అపాయాలు కలగకుండా, నష్టం జరగకుండా చూడాలని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, నీటిపారుదల అధికారులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులు

శ్రీ ప్రకాష్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి -నక్కపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన విశాఖపట్నం టౌన్ కొత్త రోడ్డు వద్ద ఉన్న మున్సిపల్ స్టేడియంలో జరిగిన హ్యాండ్ బాల్ అండర్ -19 బాల బాలికల జిల్లా జట్టు ఎంపికలలో పాయకరావుపేట శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ బాను మూర్తి తెలిపారు. బాలురు ఈ నెల 25 నుండి 27 వరకు భారత్ డిఫెన్స్ అకాడమీ, కొత్తవలస, విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలోను, బాలికలు ఈ నెల 23 నుండి 25 వరకు గవర్నమెంట్ కాలేజ్, రైల్వే కోడూరు, కడప జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వెల్లడించారు. ఎంపికైన బాలికలు పి. అలేఖ్య,ఆర్. వైష్ణవి,ఎన్. సాహితీ చందన స్టాండ్ బై ఆర్. మోహిత, ఎంపికైన బాలురుఎ. జ్యోతిష్ కుమార్,జి.అభినయ్, బి.యశ్వంత్, కె.జితేంద్ర, ఆర్.కుమార్, జయ సత్య కుమార్, కె.వెంకటేష్, స్టాండ్ బై మురళీ,ఎన్.గోపి బి.మౌనిక్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు.



నిరసన తెలుపుతున్న మహిళలు

విద్యుత్తు భారాలు మోపొద్దు

-ఐద్వా వినూత్న నిరసన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపులో భాగంగా ట్రూ అప్ చార్జీల పేరుతో రూ. 8,114 కోట్లు భారం వేయాలని భావించడం అన్యాయం అని, అదనపు భారాలు మోపవద్దని డిమాండ్ చేస్తూ సోమవారం సాయంత్రం పందిమెట్ట ప్రాంతంలో ప్రజాతంత్రం మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన, కె.మణి అధ్యక్షతన హారికేన్ లాంతరులు, కరెంట్ బిల్లులు పట్టుకుని వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ, నిత్యావసర సరుకుల ధరలు, కరెంటు చార్జీలు పెంచినందున గత ప్రభుత్వం 11 స్థానాలకు పరిమితమైందన్నారు. కార్యక్రమంలో ఐద్వా జగదాంబ జోన్ అధ్యక్షులు ఆర్.వరలక్ష్మి, సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు, కెవిపి చంద్రమౌళి, డివైఎఫ్ఐ నాయకులు సంతోష్, భవన నిర్మాణ కార్మికుల నాయకులు కె.నరసింగరావు, స్థానిక మహిళా నాయకులు సత్యవతి, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

రుషికొండ బిల్డింగ్‌లో మ్యూజియం ఏర్పాటు చేయాలి

ముఖ్యమంత్రికి ఆచార్య కెఎస్.చలం లేఖ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : రుషికొండలోని భవనాల్లో రాష్ట్ర మ్యూజియం ఏర్పాటుచేయాలని యుపిఎస్‌సి మాజీ సభ్యులు ఆచార్య ఆచార్య కెఎస్.చలం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. విశాఖలో ఉన్న ప్రస్తుత మ్యూజియం నేవీకి చెందినదని, రాష్ట్ర మ్యూజియం లేదని తెలిపారు. రాష్ట్రం విడిపోయిన తరువాత మనకు రావలసిన శిల్ప, కళా ఖండాలు, విశాఖలో దొరికిన బుద్ధుని అవశేషాలు (ఇప్పటికీ హైదరాబాద్‌లో ఉన్నవి) ఇక్కడకు తీసుకురావాలని కోరారు. మ్యూజియానికి సరిపడా గదులు ఇక్కడ ఉన్నాయని వివరించారు. ఈస్ట్ కోస్ట్ లేక తూర్పు తీర మ్యూజియంగా ప్రకటించి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేలా చూడాలని కోరారు. మిగిలిన గదులను సెమినార్లు, పరిశోధకులకు కావలసిన సౌకర్యాలు కల్పించి రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.

పోలీసు అమరవీరులకు నివాళి



కొత్తకోటలో ర్యాలీ చేపడుతున్న పోలీసులు, విద్యార్థులు

ప్రజాశక్తి -యంత్రాంగం

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలు చోట్ల సోమవారం ఘనంగా నిర్వహించారు.

ఎంవిపి కాలనీ : ప్రజల రక్షణకు అహర్నిశలు పనిచేస్తున్న పోలీసుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం బీచ్ రోడ్డులోని అమరవీరుల స్థూపానికి పోలీసు కమిషనర్ పూలమాలలతో నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విశాఖ సిటీ పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమిస్తూ నగర ప్రజలకు బాసటగా ఉంటున్నారని కొనియాడారు. ఇటీవల సిబ్బంది సంక్షేమం నిమిత్తం రెస్ట్‌రూమ్ ఏర్పాటుతో పాటు గ్రూప్ ఇన్స్యూరెన్స్ తదితరాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశామన్నారు. జిల్లా కలెక్టర్, జివిఎంసి సహకారంతో నగర పరిధిలోని ఎఐ వ్యవస్థ ద్వారా ఈ-చలాన్ల నమోదు పైలట్ ప్రాజెక్టు వేగంగా జరుగుతోందన్నారు. సిబ్బందికి ఇటీవల కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద సహకారంతో వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఏఆర్ సిబ్బంది నిర్వహించిన పరేడ్ అందర్నీ ఆకట్టుకుంది. అనంతరం ఎస్పీ అదనపు ఎస్పీ రాజ్‌కమల్ 'రోల్ ఆఫ్ హానర్' చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, జిల్లా న్యాయ మూర్తి ఆలపాటి గిరిధర్, డిసిపిలు అజిత వేజెండ్ల, మేరీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పిఎఫ్ ఆధ్వర్యాన...

ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్‌కు చెందిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) ఆధ్వర్యాన బ్యారక్‌లో పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. భారతదేశం అంతటా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఏపీ దూబే, ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి షాహిద్ స్మారక్ వద్ద అమరవీరులకు నివాళులు అర్పించారు.

మధురవాడ : విశాఖపట్నం 16వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరవీరుల స్థూపానికి కమాండెంట్ కెవి.మురళీకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విధి నిర్వహణలో పోలీసుల త్యాగాలను స్మరించారు. కార్యక్రమంలో మధురవాడ మునిసిపల్ కమిషనర్ పి.సింహాచలం, పి. సత్యనారాయణ, అడిషనల్ కమాండెంట్‌లు సిహెచ్‌విఎస్. పద్మనాభరాజు, జి .ఇలియసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం అమరవీరుల సంస్మరణ దినం జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోలీసు అమరవీరుల స్మృతి స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించి, గౌరవ వందనం చేసి, పుష్ప గుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమరులైన పోలీసుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని సూచించారు. జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 216 మంది, మన రాష్ట్రంలో ఇద్దరు పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓపెన్ హౌస్, వ్యాసరచన పోటీలు, రక్తదాన శిబిరాలు నిర్వహించి పోలీస్ అమరుల త్యాగాలను, సేవలను తెలియజేస్తామని చెప్పారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా 13 మంది అమరవీరుల ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు చొప్పున చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పిలు బి.అప్పారావు, కెవి.సత్యనారాయణ, పరిపాలనాధికారి ఎ.రామ్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు బాల సూర్యారావు, లక్ష్మి, వినోద్‌బాబు, రమేష్, మన్మథరావు, సతీష్, నరసింహమూర్తి, సంజీవరావు, జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట జంక్షన్ వద్ద సోమవారం పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తారకేశ్వరరావు పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోట: విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసుల సేవలు మరువలేనివని కొత్తకోట ఏఎస్సై బాలయ్య కొనియాడారు. రావికమతం మండలం కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కొత్తకోటలో ఏఎస్సై బాలయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు, పోలీసులు స్థానిక జడ్పీ హైస్కూలు నుంచి మెయిన్ రోడ్డు కూడలి వరకు భారీ ర్యాలీ చేపట్టి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు, గ్రామ నాయకులు చింతల కిశోర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్

కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :

జిల్లాలో బాల కార్మికులను గుర్తించేందుకు నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులను, కార్మికశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ఎన్‌సిపిసిఆర్ (నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్) మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకొని బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో సోమవారం ఆయన మాట్లాడుతూ, కార్మిక శాఖకు అన్ని విభాగాల అధికారులు పూర్తి తోడ్పాటు అందించాలని, బాల కార్మికులను గుర్తించే విషయంలో సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. నెల రోజుల పాటు జిల్లా పరిధిలోని అన్ని కంపెనీలు, ప్రయివేటు వ్యాపార సంస్థలు, దుకాణాలు, ఫ్యాక్టరీలు, ఇతర పరిశ్రమలను తనిఖీ చేయాలని, అక్కడ పని చేసేవారి వివరాలను సేకరించాలని చెప్పారు. ఎన్‌సిపిసిఆర్ మార్గదర్శకాలకు అనుగుణంగా 14 ఏళ్ల లోపు వాళ్లు ఎక్కడా కూడా పని చేయడానికి వీలు లేదని, సంస్కరణల తర్వాత 15 నుంచి 18 ఏళ్ల వరకు వయసు కలిగిన యువత నిర్దేశించిన సంస్థల్లో పని చేయొచ్చని చెప్పారు. దీన్ని పరిగణనలోకి తీసుకొని డ్రైవ్ చేపట్టాలని స్పష్టం చేశారు. 15 నుంచి 18 ఏళ్ల వయసు కలిగిన వారు ప్రమాదం లేని కంపెనీల్లో మాత్రమే పని చేయాలని, ప్రమాదకర కంపెనీల్లో పని చేయడానికి వీలులేదన్నారు. నిబంధనలు అతిక్రమించి కార్యకలాపాలు సాగించే కంపెనీలపై దృష్టి సారించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, కార్మిక శాఖ ఉప కమిషనర్ సునీత, డిఇఒ ఎల్.చంద్రకళ, బిసి వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఐసిడిఎస్, పోలీసు తదితర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఇసుక ఇవ్వాలి

-శాంతియుత ర్యాలీకి విశేష స్పందన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శాంతియుత ర్యాలీకి విశేష స్పందన లభించింది. నియోజకవర్గ నాలుగు మండలాల నుండి భవన నిర్మాణ కార్మికులు, వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ స్టేడియంలో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అబీద్ సెంటర్ నుంచి పాల్ ఘాట్ సెంటర్ మీదుగా ఆర్టీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రోడ్డుమీద బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, గబ్బాడ ఇసుక పాయింట్ నుంచి ఇసుకను ప్రజలకు ఉచితంగా ఇవ్వాలన్నారు. గబ్బాడ ఇసుక పాయింట్నుంచి 7 కోట్ల విలువైన ఇసుకను దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. ఉచితంగా ఇసుక ఇస్తామని ఎన్నికల ముందు చెప్పి ట్రాక్టర్‌కు రూ.6500 ఎలా వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా ప్రజలకు ఏమి చేస్తారో చెప్పకుండా దోచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని ప్రజల కోసమే పోరాటాలు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే గణేష్ అన్నారు. గబ్బాడ ఇసుక రీచ్ ఉన్న ఇసుక అంతా ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి హయాంలో నిల్వ చేసిందేనని చెప్పారు. అయినా టన్నుకు రూ.1165 ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇలా వచ్చే రూ. 7 కోట్ల రూపాయలు ఎవరి చేతుల్లోకి వెళతాయో ప్రజలకు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కౌన్సిలర్లు వైసిపి సీనియర్ నాయకులు రుత్తల యర్రాపాత్రుడు, చింతకాయల సన్యాసిపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.